దౌల్తాబాద్ పీహెచ్‌సీకి 30 పడకల హోదా కల్పిస్తాం

రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్

హత్నూర, న్యూస్‌టుడే: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్‌లో రూ.1.56 కోట్లతో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన దారిపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. క్షతగాత్రులకు సకాలంలో వైద్య సేవలు అందించేలా దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారిణి గాయత్రీదేవి, తహసీల్దార్ పర్వీన్‌షేక్, ఎంపీడీఓ శంకర్, స్థానిక వైద్యురాలు దివ్యజ్యోతి, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు సుహాసినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాజనర్సింహ, పక్కన మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే సునీతారెడ్డి, టీజీఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మలారెడ్డి, మదన్‌రెడ్డి తదితరులు

సేవలు పునరుద్ధరించాలని మంత్రి ఆదేశం

'హత్నూర పీహెచ్‌సీలో రెండేళ్లుగా నిలిచిన ప్రసవాలు' శీర్షికన గురువారం 'ఈనాడు'లో వచ్చిన కథనానికి మంత్రి రాజనర్సింహ స్పందించారు. ఇందుకు కారణాలను జిల్లా వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. వసతులు కల్పించి ప్రసవాల సేవలు పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వరద కాల్వ కబ్జా

న్యూస్‌టుడే, కంది: కంది మండలంలో వరద కాల్వలు, కుంటలు క్రమంగా కబ్జాకు గురవుతున్నాయి. కళ్లెదుటే స్థలాలు పరాధీనమవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోని తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కందిలోని సర్వే నంబరు 615, 616 పరిధిలోని అసైన్డు భూములను రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ సర్వే నంబరు పక్కన పడిగోని చెరువు, ఖజానాకుంటలు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిస్థాయిలో నిండి జలకళ సంతరించుకున్నాయి. 615, 616 సర్వే నంబర్ల మీదుగా సుమారు అరకిలో మీటరు వరకు 40 అడుగుల వరద కాల్వ ఉంది. ఈ కాల్వ ద్వారానే పడిగోని చెరువు, ఖజానా కుంటల్లోకి నీరు చేరుతుంది. కంది సమీపంలో బెంగళూరు జాతీయ రహదారికి పక్కనే ఈ వరద కాల్వ ఉండటంతో అక్రమార్కుల కన్ను పడింది. మొరంపోసి కాల్వను ఆక్రమించి.. చదును చేశారు. రాజకీయ నాయకుల అండదండలతోనే ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి వరద కాల్వను కాపాడాలని కోరుతున్నారు.



కాల్వ పూడ్చి మొరం పోశారిలా..

ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం: విజయలక్ష్మి, తహసీల్దార్

కంది మండలంలో చెరువులు, కుంటల శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, కాల్వలు కబ్జా చేస్తే సహించేది లేదు. రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో నిత్యం పర్యవేక్షిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం.

ప్రత్యేక పనులకు గ్రహణం


- జిల్లాలో ఎస్‌డీపీ నిధుల వినియోగం తీరిది..

న్యూస్‌టుడే, సంగారెడ్డి అర్బన్

పట్టణాలు, పల్లె ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసినప్పటికీ.. పనుల్లో పురోగతి లేదు. దీంతో నిర్దేశిత లక్ష్యం నెరవేరడం లేదు. ఈ ఏడాది జనవరిలో జిల్లాకు రూ.50 కోట్ల ప్రత్యేక అభివృద్ధి నిధి(ఎస్‌డీఎఫ్) విడుదలను ప్రభుత్వం. వీటిని ఒక్కో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున అధికారులు కేటాయించారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం, గుత్తేదారులు ఆసక్తి చూపకపోవడంతో పనుల్లో పురోగతి కనిపించడం లేదు.

నిర్దేశిత లక్ష్యాలివి

జిల్లాలో సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్, అందోలు, పటాన్‌చెరు నియోజకవర్గాలున్నాయి. వాటి పరిధిలో 647 గ్రామ పంచాయతీలు, ఎనిమిది పురపాలక సంఘాలున్నాయి. ఆయా వార్డులు, కాలనీల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేసింది. ఇందులో ప్రతి నియోజకవర్గ పరిధిలో విద్యా విభాగానికి రూ.2 కోట్లు, తాగునీటికి రూ.కోటి, కలెక్టర్ కార్యాలయంతోపాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు రూ.50 లక్షలు ఖర్చు చేయాలని నిబంధనలు విధించింది. మిగిలిన నిధుల్లో రూ.6.50 కోట్లలో మురుగు కాల్వలు, సీసీ రహదారులు, కమ్యూనిటీ భవనాలు, ఇతరత్రా మౌలిక వసతులకు కేటాయించేలా వెసులుబాటు కల్పించింది. ఆయా పనుల నివేదికను జిల్లా కలెక్టర్ ద్వారా పంపిస్తే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తెలుపుతారు. రూ.5 లక్షలలోపు పనులకు టెండర్లు అవసరం లేదు. నామినేషన్ పద్ధతిలో చేపట్టవచ్చు.



ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో అసంపూర్తి ప్రహరీ

ఆరంభించనివే అధికం

- తాగునీటి సమస్యలు తీర్చేందుకు మిషన్ భగీరథ విభాగానికి 249 పనులు ఎంపిక చేయగా.. బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు చేతులెత్తేశారు.
- పంచాయతీరాజ్ శాఖ పరిధిలో సంగారెడ్డి, అందోలు డివిజన్‌లు ఉన్నాయి. అందోలు డివిజన్‌లో 183 పనులు, సంగారెడ్డి డివిజన్‌లో 315 పనులు ఇప్పటికీ ఆరంభించలేదు. బిల్లుల చెల్లింపు సమస్య వల్ల గుత్తేదారులు ముందుకు రావడం లేదని పీఆర్ ఈఈ జగదీశ్వర్ పేర్కొన్నారు.

పురోగతి ఇలా..

- జిల్లాలో నియోజకవర్గాలు: 5
- ఒక్కో నియోజకవర్గానికి కేటాయింపు: రూ.10 కోట్లు
- మొత్తం గ్రామ పంచాయతీలు: 647
- పురపాలికలు: 8
- మిషన్ భగీరథకు ఎంపికైన పనులు: 249
- నిధుల అంచనా: రూ.6.36 కోట్లు
- పూర్తయిన పనులు: 10
- సంగారెడ్డి డివిజన్‌లో ఎంపికైన పీఆర్ పనులు: 374
- నిధుల అంచనా: రూ.22.22 కోట్లు
- పూర్తయిన పనులు: 12
- అందోలు డివిజన్‌లో ఎంపికైన పీఆర్ పనులు: 243
- నిధుల అంచనా: రూ.13.04 కోట్లు
- పూర్తయిన పనులు: 14

వేగవంతం చేస్తాం..

ఈ ఏడాది జనవరిలో నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున జిల్లాకు నిధులు మంజూరయ్యాయి. చాలా చోట్ల పనులు నిలిచిపోయాయి. ఇందుకు కారణాలు తెలుసుకొని పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. – **పద్మజారాణి, డీఆర్వో.**

పారిశ్రామిక ప్రాంతంలో పటిష్ఠ భద్రత: ఎస్పీ



మొక్క నాటి నీరు పోస్తున్న ఎస్పీ రూపేష్

జిన్నారం, న్యూస్‌టుడే: పటాన్‌చెరు నియోజకవర్గంలోని పారిశ్రామిక ప్రాంతంలో పటిష్ఠ భద్రతకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెన్నూరి రూపేష్ పేర్కొన్నారు. గురువారం ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. స్టేషన్ ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన కార్మికులున్న పారిశ్రామిక ప్రాంతం కావడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, కార్మికుల భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక నిఘా ఉందని, ఎవరు నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తప్పవన్నారు. ఐడీఏ బొల్లారంలో క్రైమ్ రేట్ నియంత్రణలోనే ఉందన్నారు. ఏఎస్పీ సంజీవరావు, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ గంగాధర్, ఎస్సై రాములు తదితరులు వెంట ఉన్నారు.

తొలగిన గుర్రపు డెక్క.. కనువిందు చేస్తున్న మంజీర

హత్నూర మండలం కొన్యాల శివారులో మంజీరపై నిర్మించిన అడ్డుకట్టకు సమీపంలో నది నిండుకుండలా కనిపిస్తుంది. దీనిలో గతంలో గుర్రపు డెక్క భారీగా పెరగడంతో మత్స్యకారులు, రైతులు అటువైపు వెళ్లేందుకు సాహసించేవారు కాదు. ఇటీవల కురిసిన వర్షాల వరదకు గుర్రపు డెక్క మొత్తం కొట్టుకుపోయింది. మంజీర నది కనువిందు చేస్తోంది. –న్యూస్‌టుడే, హత్నూర.



తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య

జోగిపేట టౌన్, న్యూస్‌టుడే: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఆ విశ్వవిద్యాలయం డైరెక్టర్, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా.వై.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం స్థానిక నెహ్రూ స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. రెగ్యులర్ విద్యకు దీటుగా వివిధ రకాల కోర్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2024-25 విద్య సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు ఈ నెలాఖరు వరకు గడువు ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ రమేశ్, ప్రొ.దయాకర్, సమన్వయకర్త పండరి తదితరులు వెంట ఉన్నారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డు

పూర్తి వివరాల నమోదుకు విద్యాశాఖ ఆదేశం

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సదాశివపేట

విద్యాహక్కు నూతన చట్టం అమలులో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డు అందించేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. ఆధార్ కార్డు తరహాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అపార్ కార్డు(ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ)ని అందించనున్నారు. దీనిపై మొదట ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నారు. విద్యార్థికి 12 అంకెలతో కూడిన గుర్తింపు కార్డు ఇవ్వనున్నారు. ఇందుకోసం అంతర్జాలంలో వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.



ఎలా దరఖాస్తు చేయాలంటే..

అకడమిక్ ఆఫ్ క్రెడిట్ అంతర్జాలాన్ని ఓపెన్ చేయాలి. డిజిలాకర్ ఖాతాను సృష్టించి.. చరవాణి నంబరు, చిరునామా, ఆధార్ కార్డు వివరాలు, విద్యార్థి పేరు, తరగతి, పాఠశాల పేరు తదితర వివరాలను నమోదు చేయాలి. అనంతరం 12 అంకెలతో అపార్ కార్డు రూపొందుతుంది. కార్డు నమోదు సమయంలో తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరి. విద్యార్థులకు అందించే అపార్ కార్డులో ప్రత్యేకతలున్నాయి. విద్యార్థులు సాధించిన విజయాలు, మార్కులు, మెమోలు, ఉపకార వేతనాలు, నైపుణ్యాలను సంక్షిప్తంగా ఇందులో నమోదు చేస్తారు. విద్యార్థి జీవితకాల కార్డుగా దీన్ని పరిగణిస్తారు. ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. విద్యార్థి ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ ప్రక్రియను సులభతరం చేస్తుంది.

విభాగం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	861	55,210
ప్రాథమికోన్నత	181	22.124
ఉన్నత	203	45,126
కస్తూర్బా పాఠశాలలు	21	4,234
కస్తూర్బా-కళాశాలలు	10	1,428
ఆదర్శ	10	5,249
గురుకులాలు	42	34,100

క్లిక్ చేస్తే సమగ్ర సమాచారం

అపార్ కార్డు వచ్చిన తర్వాత యూడైస్ సహాయంతో విద్యార్థికి సంబంధించిన అన్ని వివరాలు నమోదు చేస్తారు. కార్డు నంబర్‌తో ఆన్‌లైన్‌లో ఓపెన్ చేస్తే విద్యార్థులకు సంబంధించిన సమగ్ర వివరాలు కనిపిస్తాయి. పిల్లలకు సంబంధించిన వివరాలు అపార్ కార్డులో ఉంటాయని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచండి: కలెక్టర్

హత్నూర, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరిగేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు పట్టిక, ఆవరణలో పరిసరాలు పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. శుభ్రత పాటిస్తూ రుచికరంగా వండి పెట్టాలని సూచించారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులు శతశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా గ్రూపులుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. నిర్దేశించిన విధంగా సిలబస్ పూర్తి చేయాలన్నారు. విద్యార్థులు ఇంటికెళ్లిన తర్వాత పాఠాలు పునశ్చరణ చేసుకోవాలని సూచించారు. టీవీ, చరవాణిలకు అధిక సమయం కేటాయించవద్దని పేర్కొన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యల్ని ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జంతువులు లోనికి రాకుండా వెంటనే గేటు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శి బాల్‌రాజ్‌ను కలెక్టర్ ఆదేశించారు.

ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు: డీఈవో

గుమ్మడిదల, న్యూస్‌టుడే: విద్యార్థులు పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గురువారం గుమ్మడిదల మండలం కానుకుంట జడ్పీ పాఠశాలలో ఎస్‌ఏ-1 పరీక్షలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రణాళికతో చదువుకోవాలని సూచించారు. అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. కానుకుంట జడ్పీ, ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలమైన విషయాన్ని ఉపాధ్యాయులు డీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు నీరజ తదితరులు వెంట ఉన్నారు. అనంతరం ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ రాంబాబు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

'ఎన్నికల హామీని విస్మరించడం తగదు'

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: వేతనాలు పెంచి.. పురపాలక కార్మికులకు న్యాయం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో నేడు చేపట్టే పురపాలక అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి కోరారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. కార్మికులను క్రమబద్ధీకరిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని విస్మరించడం సరికాదన్నారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సువర్ణ, నర్సింలు, శీను, లక్ష్మణ్, నర్సింలు, రాజు పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగదారుల ఫోరం సదస్సు రేపు

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక విద్యుత్తు డివిజన్ కార్యాలయంలో ఈ నెల 26న ఉదయం 11.30 గంటలకు విద్యుత్తు వినియోగదారుల ఫోరం సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎస్‌ఈ శ్రీనాథ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫోరం ఛైర్‌పర్సన్ నాగేశ్వర్‌రావు, సభ్యులు హాజరుకానున్నారని తెలిపారు. వినియోగదారులు విద్యుత్తు సరఫరాలో అంతరాయం, ఇతర ఫిర్యాదులు ఉంటే ఫోరం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అనుమతిలేని ప్రాథమిక చికిత్స కేంద్రాల సీజ్

రాయికోడ్, న్యూస్‌టుడే: జిల్లా వైద్యారోగ్య శాఖ ఆదేశానుసారం అనుమతి లేని, సరైన పత్రాలు లేని ప్రాథమిక చికిత్స కేంద్రాలు, డయాగ్నోస్టిక్స్ కేంద్రాలు సీజ్ చేశామని డా.సోహైల్ తెలిపారు. గురువారం రాయికోడ్ మండలంలోని కర్చల్, హస్నాబాద్, సింగీతం, సిరూర్, రాయికోడ్, చిమ్నాపూర్ గ్రామాల్లో తనిఖీ బృందం పర్యటించింది. రాయికోడ్‌లో ఒక ఆసుపత్రి, చిమ్నాపూర్‌లో రెండు డయాగ్నోస్టిక్స్ కేంద్రాలు, రెండు ప్రాథమిక చికిత్సాలయాలు, సింగీతంలో ఒక ప్రాథమిక చికిత్సాలయాన్ని సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని నిరసన

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేపట్టి.. విద్య, ఉద్యోగాల్లో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర మాదిగ ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డిలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏబీసీడీ వర్గీకరణకు హామీ ఇచ్చి.. మోసం చేయడం సరికాదన్నారు. ఇందుకు నిరసనగా గురువారం వరంగల్ జిల్లాలో జరిగిన ఎంఎస్ఎఫ్ సమావేశానికి తరలి వెళ్లారు. సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయసేవలు

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: ఖైదీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కోర్టు న్యాయమూర్తి జి.భవానీచంద్ర జైలు అధికారులను ఆదేశించారు. గురువారం కందిలోని కేంద్ర కారాగారాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. ఖైదీలకు సమయానికి బెయిల్ మంజూరు, ములాఖత్ వంటి సమస్యలు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. న్యాయసేవలు ఉచితంగా అందించేందుకు ప్రత్యేకంగా ఓ న్యాయవాదిని నియమిస్తామన్నారు. పురుష, మహిళా ఖైదీలతో వేర్వేరుగా మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలులోని భోజనశాలలు, శౌచాలయాలను పరిశీలించి సూచనలు చేశారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్, జైలు పర్యవేక్షకులు సంతోష్‌కుమార్ రాయ్, జైలర్లు, ఉప జైలర్లు తదితరులు వెంట ఉన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి భవానీచంద్ర

పసుపు సాగుపై అన్నదాతల ఆసక్తి

నిల్వ, మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే మేలు



న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్, జోగిపేట

వంటల్లో నిత్యం పసుపు వినియోగిస్తాం. ఏ శుభకార్యం జరగాలన్నా పసుపు ఉండాల్సిందే. ఈ పంట సాగుచేసిన అన్నదాతలకు నష్టాలే మిగులుతున్నాయి. ప్రతి సంవత్సరం ఇలాంటి పరిస్థితులే ఉండగా.. గతేడాది ఈ పంట సాగు చేసిన వారికి లాభాలు సొంతమయ్యాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో పసుపు సాగుపై ఈ ఏడాది రైతులు ఆసక్తి చూపారు.

పసుపు సాగు తీరు	
సంవత్సరం	విస్తీర్ణం (ఎకరాల్లో)
2021	470
2022	197
2023	94
2024	167

విక్రయానికి ఇబ్బందులు

జిల్లాలో కొండాపూర్, జహీరాబాద్, న్యాల్‌కల్, మొగుడంపల్లి, కోహీర్ మండలాల్లో పసుపు పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు. గతేడాది 94 ఎకరాల్లో మాత్రమే పంట వేయగా.. ఈ ఏడాది సాగు విస్తీర్ణం 167 ఎకరాలకు చేరింది. పసుపు సాగు చేస్తున్న రైతులకు స్థానికంగా విపణి సదుపాయం లేకపోవడం గమనార్హం. అప్పులు చేసి పంటసాగు చేసిన వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. మహారాష్ట్రలోని విపణుల్లో పసుపును విక్రయించాల్సి వస్తోంది. స్థానికంగా విక్రయాలకు ఏర్పాటు చేస్తే అక్కడి వరకు వెళ్లే బాధ తప్పుతుంది.

దళారులను ఆశ్రయించడంతో నష్టం

పసుపు ఉత్పత్తులను నిల్వ చేసేందుకు అవసరమైన సదుపాయాలు జిల్లాలో లేకపోవడం రైతులకు ఇబ్బందిగా మారింది. ఎక్కువ రోజులు ఇంట్లో నిల్వ ఉంచే పరిస్థితి లేదు. దీంతో దళారులను ఆశ్రయించి ఎంతో కొంతకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవసరమైన శీతల గిడ్డంగులు ఉంటే ధర ఆశాజనకంగా ఉన్న సమయంలో విక్రయించేందుకు వీలుండేదని, అధికారులు ఇప్పటికైనా ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతుల్ని ప్రోత్సహిస్తున్నాం

గతంలో జిల్లాలో వెయ్యి ఎకరాలకుపైగా విస్తీర్ణంలో పసుపు సాగు ఉండేది. ధరలు లేకపోవడంతో సాగు తగ్గింది. ఇప్పుడు ధరలు బాగుండటంతో పసుపు సాగుకు ముందుకు వచ్చే రైతుల్ని ప్రోత్సహిస్తున్నాం. సాగులో సందేహాలను నివృత్తి చేస్తున్నాం. నూతన వంగడాలను కూడా రైతులకు పరిచయం చేస్తున్నాం.

–సోమేశ్వరరావు, ఉద్యానశాఖ జిల్లా అధికారి.

సాధారణ ప్రసవాలే క్షేమం

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: మాతా శిశు మరణాల సంఖ్య తగ్గించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ జి.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని మాతాశిశు వైద్యారోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహజ కాన్పులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. శస్త్ర చికిత్సలతో కాన్పుల వల్ల మహిళలకు భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవన్నారు. శస్త్ర చికిత్సలకు వైద్యులపై ఒత్తిడిచేయడం తగదన్నారు. సాధారణ ప్రసవమే తల్లీ బిడ్డలకు క్షేమదాయకమన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ దేవర సుధామాధురి, మహిళా వైద్య నిపుణులు నాగలక్ష్మి, అనిత, ఆర్ఎంవో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వైద్య విద్యార్థుల ర్యాలీ

నిరుద్యోగ సమస్యలపై గళం విప్పుతా: నరేందర్‌రెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే నిరుద్యోగ సమస్యపై మండలిలో గళం విప్పుతానని అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలో విలేకర్ల సమావేశంలో గురువారం మాట్లాడారు. న్యాయవాదుల రక్షణ కోసం చట్టం తీసుకొస్తామని పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు నవంబరు ఆరో తేదీలోపు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. 34 సంవత్సరాలుగా తాను విద్యారంగంలో విశిష్ట సేవలు అందించినట్లు తెలిపారు. ఉత్తమ ఆలోచనలతో రాజకీయాల్లోని వస్తున్నట్లు వివరించారు.

పటాన్‌చెరులో డయాలసిస్ కేంద్రం

పటాన్‌చెరు: మూత్రపిండాల సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సేవలు అందించేందుకు వీలుగా పటాన్‌చెరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని ఆరోగ్య శాఖ జిల్లా కో-ఆర్డినేటర్ సంగారెడ్డి తెలిపారు. గురువారం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రిని సందర్శించి, రేడియాలజీ, స్కానింగ్, ఎక్స్‌రే కేంద్రాలు పరిశీలించారు. రోజువారీగా ఎన్ని ప్రసవాలు చేస్తున్నారనే వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్య బృందంతో సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత వ్యాధులున్న నిరుపేదలు పూర్తిస్థాయి డయాలసిస్ సేవలు పొందేందుకు వీలుగా ఏరియా ఆసుపత్రి రెండో అంతస్తులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మొత్తం 5 పడకలతో రోజుకు 20 మంది డయాలసిస్ సేవలు పొందవచ్చని అధికారులు వెల్లడించారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 9000014771

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 8008001735

TG

(c) eenadu

రుణ సహకారం.. అభ్యున్నతికి దోహదం

మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తున్న డీసీసీబీ

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్

రైతులకు అన్ని విధాలుగా సహకారం అందించాలన్న లక్ష్యంతో ఏర్పాటుచేసిందే డీసీసీ బ్యాంకు. కర్షకులకు రుణాలు ఇస్తూ, వాటిని వసూలు చేస్తుంటుంది. అయితే ఇటీవల కాలంలో డీసీసీబీ తన పంథాను మార్చుకొని ముందుకు సాగుతోంది. మహిళలకూ సహకారం అందిస్తోంది. ఆర్థికంగా ఎదిగేలా ప్రోత్సహించడంలోనూ ముందుంటోంది. వాణిజ్య బ్యాంకులకు దీటుగా సంఘాలకు రుణాల అందిస్తోంది. వసూలైన వడ్డీలో కొంత మొత్తాన్ని తిరిగి చెల్లిస్తోంది. ఈ విషయంలో రాష్ట్రంలోనే మెదక్ డీసీసీబీ ముందంజలో నిలవడం విశేషం.

రాష్ట్రంలో మొత్తం తొమ్మిది డీసీసీబీలు కొనసాగుతున్నాయి. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన ఏర్పాటుచేశారు. వీటి ద్వారా మహిళా సంఘాలకు రుణాలు అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సహకార కేంద్ర బ్యాంకుల ద్వారా రూ.440.01 కోట్లు పంపిణీ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రుణ పంపిణీలో రాష్ట్రంలో తొలిస్థానంలో నిలిచి ప్రభుత్వ పురస్కారం అందుకుంది. ఈ సారి కూడా అదే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. నాబార్డు సహకారంతో మహిళల్లో ఆర్థిక అక్షరాస్యత పెంచేందుకు కృషి చేస్తోంది.

ఐదేళ్లలో మహిళా సంఘాలకు అందించింది..

సంవత్సరం	రుణాల పంపిణీ (రూ.కోట్లలో)
2020-21	309.09
2021-22	325.40
2022-23	393.56
2023-24	420
2024-25	440.11

(అక్టోబరు 20 వరకు)

బీమాపై అవగాహన

ప్రధానమంత్రి బీమా పథకాలను మహిళా సంఘాల సభ్యులకు అమలు చేస్తున్నారు. ఏడాదికి రూ.12 చెల్లిస్తే ప్రమాద బీమా, రూ.330తో సాధారణ బీమా పథకాన్ని వర్తింపజేస్తున్నారు. ప్రమాద బీమా చేసుకున్న వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షలు, సాధారణ బీమాలో చేరిన వారు ఆత్మహత్య మినహా ఎలా మృతిచెందినా రూ.2లక్షలు, రెండింటిలో చేరితే రూ.4లక్షలు సాయం అందిస్తారు. సభ్యులకు వీటిపై అవగాహన కల్పిస్తున్నారు.

రూ.2 లక్షలు తీసుకొని..



సంగారెడ్డి జిల్లా సంగుపేటకు చెందిన వజ్రమ్మ.. స్థానిక చైతన్య పొదుపు సంఘంలో సభ్యురాలు. 12 ఏళ్లుగా పొదుపు చేస్తూ వస్తున్నారు. డీసీసీబీ నుంచి రూ.2 లక్షల రుణం తీసుకొని.. కిరాణా దుకాణం, టీ హోటల్ నిర్వహిస్తున్నారు. దీని నిర్వహణతో వస్తున్న మొత్తాన్ని కుటుంబ పోషణకు వినియోగిస్తున్నారు. ప్రతి నెలా బ్యాంకు అధికారులకు క్రమం తప్పకుండా రుణ వాయిదాలు చెల్లిస్తున్నారు. - న్యూస్‌టుడే, జోగిపేట

నాటు కోళ్ల పెంపకంతో..



మెదక్ జిల్లా చేగుంట మండలం గొల్లపల్లి జైత్రాం తండాకు చెందిన నవ జ్యోతి మహిళా సంఘానికి చెందిన లక్ష్మి డీసీసీబీ నుంచి రూ.1.5 లక్షల రుణం తీసుకున్నారు. నాలుగు నెలల కిందట కోడి పిల్లల పెంపకాన్ని చేపట్టారు. 2,500 నాటు కోడి పిల్లలు తీసుకొచ్చి.. ఒక్కోటి 250 గ్రా. బరువు కాగానే విక్రయిస్తున్నారు. తీసుకున్న రుణాన్ని క్రమం తప్పకుండా చెల్లిస్తూ పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటున్నారు. - న్యూస్‌టుడే, చేగుంట

5 శాతం తిరిగి చెల్లింపు

స్వయం సహాయక సంఘాలకు 12 శాతం వడ్డీపై రుణాలు అందిస్తున్నారు. హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలో ఆయన చొరవతో డీసీసీబీ పరిధి సంగారెడ్డి జిల్లాలోని సంఘాలకు వడ్డీలో 5 శాతం తిరిగి చెల్లిస్తున్నారు. 2020 జులైలో ఇది మొదలైంది. ఈ మొత్తాన్ని సంఘాల అభ్యున్నతికి వెచ్చిస్తున్నారు. ఇప్పటివరకు రూ.1.50 కోట్లు జిల్లా సమాఖ్యకు అందజేయడం గమనార్హం. ఇలా వెనక్కి ఇచ్చిన వడ్డీలో ఒక శాతం జిల్లా సమాఖ్య, 2 శాతం మండల సమాఖ్యలకు, మిగతాది గ్రామైక్య సంఘాలకు కేటాయిస్తున్నారు.

సందడిగా ఎంపిక పోటీలు



క్రీడాకారులతో నాగరాజు, నగేష్, వంశీ, వినయ్

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: త్వరలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలని ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు సూచించారు. గురువారం మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. సిద్దిపేట, గజ్వేల్, సంగారెడ్డి, మెదక్, సదాశివపేట, జహీరాబాద్‌కు చెందిన 120 మంది పాల్గొన్నారు. జట్టుగా విభజించి పోటీలు కొనసాగించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు ఎస్.అరుణ్ దినకరన్, శ్రీకాంత్, ఎ.డి. సాది, ఎం.జాన్‌పాల్‌లను ఎంపిక చేశారు. వీరు ఈ నెల 25 నుంచి 30 వరకు హైదరాబాద్ జింఖానా మైదానంలో జరిగే శిక్షణ శిబిరానికి హాజరుకానున్నారు. అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి సెలక్షన్ కమిటీ మెంబర్ నగేష్, ఫుట్‌బాల్ అకాడమీ అధ్యక్ష, కార్యదర్శులు వంశీ, వినయ్, శిక్షకుడు ప్రకాష్ పాల్గొన్నారు.

అఖిలభారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


చేగుంట: అఖిల భారత విశ్వవిద్యాలయాల ఫెన్సింగ్ (కత్తిసాము) పోటీలకు మెదక్ జిల్లా నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు శిక్షకుడు కరణం గణేశ్‌రవికుమార్ తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో జరిగిన విశ్వవిద్యాలయాల కత్తిసాము పోటీల్లో ఫాయిల్ విభాగంలో కరణం నిశాంత్, ఈపీ విభాగంలో శ్రీశాంత్, ముఖేష్, సాబేర్‌లో జవదుద్దీన్, ఈపీలో రాజేశ్వరిలు ప్రతిభ చూపారు. వీరు నవంబరు 6 నుంచి 10 వరకు జమ్ములోని యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

27న స్వేరోస్ జాతీయ సభ

బెజ్జంకి, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో ఈ నెల 27న నిర్వహించే స్వేరోస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర చీఫ్ కన్వీనర్ బలుగూరి దుర్గయ్య కోరారు. గురువారం బెజ్జంకిలో కమిటీ నాయకులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. సభకు స్వేరోస్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో హాజరయ్యేలా విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. మహనీయుల ఆశయాల సాధనతో పాటు విద్యార్థుల ఉజ్వల భవితకు స్వేరోస్ కమిటీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య, ప్రకాశ్, కరీంనగర్ జిల్లా ఇన్‌ఛార్జి మారుతి, జిల్లా అధ్యక్షుడు బాబు, రాష్ట్ర నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ప్రేమ విఫలమైందని యువకుడు..



విశ్వసాయి

సిద్దిపేట టౌన్: ప్రేమ విఫలమై ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన బోదనకారి విశ్వసాయి (22) మొబైల్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పట్టణానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. కొన్నాళ్లకు వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. బుధవారం రాత్రి విశ్వసాయి బయటకు వెళ్లాడు. కోమటిచెరువులో దూకి చనిపోతున్నానంటూ మిత్రులకు చరవాణిలో సందేశం పంపించాడు. వారు యువకుడి కుటుంబసభ్యులకు చేరవేశారు. వారు అక్కడికి చేరుకునేసరికి చెరువులో దూకాడు. పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో వెతికి మృతదేహాన్ని వెలికితీశారు. తల్లి జయమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఆర్థిక ఇబ్బందులతో అన్నదాత..



మహేందర్

చేర్యాల: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మండలంలోని మర్రిముచ్చాలకు చెందిన వంగ మహేందర్‌రెడ్డి(56), సత్యలక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయమే జీవనాధారం. అకాల వర్షాలతో పంటలకు తెగుళ్ల సోకగా నష్టపోయాడు. రూ.2.01 లక్షల రుణమాఫీ కాలేదు. దీంతో మనస్తాపం చెందాడు. గురువారం భార్యతో కలిసి పొలానికి వెళ్లాడు. పంటకు పురుగు మందు పిచికారీ చేశాడు. భార్యను అక్కడే వదిలేసి ఇంటికొచ్చి పురుగు మందు తాగాడు. చుట్టుపక్కల వారు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే చనిపోయాడని తేల్చారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

మద్యం తాగొద్దన్నందుకు రైతు..



శ్రీనివాస్

దుబ్బాక: మద్యం తాగొద్దని కుటుంబీకులు చెప్పడంతో మనస్తాపం చెందిన ఓ రైతు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్సై గంగరాజు తెలిపిన వివరాలు.. పెద్దగుండవెల్లికి చెందిన పంజ శ్రీనివాస్ (49)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరు నెలల క్రితం అతడికి గుండె శస్త్రచికిత్స జరిగింది. అప్పటి నుంచి మందులు వాడుతూనే రోజూ మద్యం తాగుతున్నాడు. ఈ నెల 22న రాత్రి మద్యం తాగి ఇంటికొచ్చాడు. కుటుంబీకులు నిలదీయగా గొడవ పడడు. బుధవారం తెల్లవారుజామున పొలం వద్ద కొట్టంలోకి వెళ్లి ఆత్మహత్యకు యత్నించాడు. గుర్తించిన కుటుంబీకులు 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య రాజమణి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కుటుంబ కలహాలతో..



నర్సింహులు

మాసాయిపేట (చేగుంట): కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. చేగుంట ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాలు.. చేగుంట ఠాణా పరిధి మాసాయిపేట మండలం చెట్లతిమ్మాయిపల్లి పులిగుట్టతండాకు చెందిన నర్సింహులు (45), శాంతి దంపతులకు ముగ్గురు కుమారులు. కొంతకాలంగా ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపం చెందిన నర్సింహులు బుధవారం రాత్రి పొలం వద్ద ఓ చెట్టుకు ఉరేసుకున్నాడు. గురువారం ఉదయం కుటుంబీకులు లేచి చూసేసరికి కనిపించకపోవంతో అంతటా వెతికారు. పొలం వద్ద విగతజీవిగా కనిపించాడు. కేసు నమోదైంది.

చికెన్ ధరలు		
ఫాంరేటు 120–00	డ్రెస్డ్ 206–00	
రిటైల్ 142–00	స్కిన్‌లెస్ 234–00	

ఆచరణలో ఆదర్శం.. స్వచ్ఛతలో మేటి


● సిద్దిపేటకు కితాబిచ్చిన 11 పురపాలికల అధికారులు



డీఆర్‌సీసీ కేంద్రం సందర్శనలో..

సిద్దిపేట, న్యూస్‌టుడే: స్వచ్ఛతలో సిద్దిపేట బల్దియా ఆచరణాత్మకంగా, ఆదర్శంగా నిలిచిందంటూ రాష్ట్రంలోని వివిధ పురపాలికల కమిషనర్లు, అధికారులు కితాబునిచ్చారు. తడి, పొడి, హానికర చెత్త నిర్వహణలో మేటిగా మారిందంటూ ప్రశంసించారు. గురువారం రాష్ట్రంలోని 11 పురపాలికల కమిషనర్లు, అధికారులు సిద్దిపేటలో పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలు తెలుసుకున్నారు. బల్దియా అధ్యక్షురాలు మంజుల, కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, అధికారులు.. ఇక్కడి ప్రత్యేకతలను వివరించారు. తడి, పొడి, హానికర చెత్త వేర్వేరుగా సేకరణ తీరును తెలుసుకున్నారు. గృహ యజమానులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను పకలరించారు. బుస్సాపూర్‌లో సీఎన్‌జీ (బయోగ్యాస్) ప్లాంట్, ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్), డీఆర్‌సీసీ (పొడిచెత్త వనరుల సేకరణ కేంద్రం)ని పరిశీలించారు. స్వచ్ఛబడి విశేషాలు తెలుసుకున్నారు. కోమటిచెరువును సందర్శించారు. వైస్ ఛైర్మన్ కనకరాజు తదితరులు ఉన్నారు. చేర్యాల, దుబ్బాక, గజ్వేల్-ప్రజ్ఞాపూర్, హుస్నాబాద్, జనగాం, నర్సంపేట, వర్ధన్నపేట, సిరిసిల్ల, ఆర్మూర్, భీమ్‌గల్, బోధన్ పురపాలికల బృందాలు సందర్శించాయి. రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిన మున్సిపాలిటీలను ఎంపిక చేశారని, వాటిలో సిద్దిపేట ఒకటని కమిషనర్ తెలిపారు. 46 పురపాలికల అధికారులు వస్తారన్నారు.

అనంతగిరి.. పక్షుల లోగిలి



న్యూస్‌టుడే, వికారాబాద్ గ్రామీణ: వికారాబాద్ అనంతగిరిలో పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు మనసుదోచే ఆహ్లాదకర వాతావరణంతో పాటు వివిధ రంగుల్లో పక్షులు దర్శనమిచ్చి ప్రకృతి సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. అనంతగిరిలో మొత్తం 228 పక్షులు తలదాచుకుంటున్నాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. వింత శబ్దాలు చేస్తుంటే సందర్శకులకు అక్కడి నుంచి వెళ్లాలనిపించదు. పక్షి ప్రేమికులు హైదరాబాద్ బర్డ్స్ అసోసియేషన్ వారు ప్రతి సంవత్సరం అనంతగిరి సందర్శించి పక్షుల చిత్రాలు తీస్తుంటారు. పాల పిట్ట, బ్లాక్‌డ్రోంగో, డవ్, రోజ్ బర్డ్ తదితర పక్షులు అడవిలో అలరిస్తున్నాయి. పక్షుల వివరాలు తెలుసుకునేందుకు నడకదారిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అక్టోబరు నుంచి ఫిబ్రవరి వరకు మాత్రమే కనిపిస్తాయని సభ్యులు తెలిపారు.

పీహెచ్‌సీలో యువకుడి దారుణ హత్య



వివరాలను సేకరిస్తున్న క్లూస్‌టీం

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: గుర్తు తెలియని యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటన చిన్నశంకరంపేటలో గురువారం జరిగింది. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి తెలిపిన ప్రకారం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తెరిచేందుకు గురువారం ఉదయం వైద్య సిబ్బంది, మండల వైద్యాధికారిణి సాయిసింధూ వెళ్లారు. ఆసుపత్రి వెనుకభాగంలో ఉన్న తలుపు తీయగానే ఓ యువకుడు రక్తం మడుగులో పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్సై నారాయణ ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. తెల్లవారు జామున దుండగులు బండరాయితో యువకుడిపై దాడి చేసి, ఇష్టానుసారం కొట్టి హతమార్చారు. అనంతరం మొక్కల రక్షణకు ఉంచిన ట్రీగార్డులను మృతదేహంపై వేసి దహనం చేసేందుకు ప్రయత్నించారు. ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మండల వైద్యాధికారిణి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని, సీసీ కెమెరాలను పరిశీలించి నిందితులను పట్టుకుంటామని, యువకుడి వివరాలు తెలియాల్సి ఉందని డీఎస్పీ వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న పీహెచ్‌సీలో ఈ ఘటన జరిగింది. దీంతో పట్టణ వాసులు భయాందోళనకు గురయ్యారు.

విద్యుదాఘాతంతో రైతు మృత్యువాత



నాగరాజు

రామాయంపేట: విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. రామాయంపేట ఎస్సై బాలరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని ఝాన్సీలింగాపూర్‌కు చెందిన నాగరాజు (36), లత దంపతులకు ముగ్గురు సంతానం. నాగరాజు తనకున్న రెండెకరాలను సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లగా, పంటకు నీరు పారించాలని మోటారు ఆన్ చేసేందుకు స్టార్టర్ డబ్బా వద్దకు వెళ్లాడు. ఫ్యూజ్ సరిచేసే క్రమంలో విద్యుత్తు తీగ తగిలి కరెంట్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న వారు గమనించి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదైంది.

చేపలవేటకు వెళ్లి..



సర్వాల్‌సింగ్

కుల్కచర్ల, న్యూస్‌టుడే: చేపలు పట్టేందుకు కుంటకు వెళ్లిన వ్యక్తి అందులోనే మునిగి మృతి చెందిన సంఘటన కుల్కచర్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. సర్వాల్‌సింగ్ (36) ఇనుప సామాన్ల దుకాణంలో కూలీ. గురువారం స్థానిక కుంటలో చేపలను పట్టేందుకు వెళ్లాడు. ఈత రాకున్నా.. స్నానం చేసేందుకు అందులోకి దిగుతుండగా అతడి బంధువు వారించాడు. అయినా వినకుండా దిగి నీటమునిగిపోయాడు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. అతడికి ఇద్దరు కూతుళ్లు, ముగ్గురు కుమారులున్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీ..

అల్లాదుర్గం: రోడ్డు ప్రమాదంలో ఓ కూలీ మృతి చెందాడు. మెదక్ జిల్లా అల్లాదుర్గం ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని సీతానగర్‌కు చెందిన వెంకయ్య (60), తులసమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. అందరికీ వివాహాలయ్యాయి. భార్యాభర్తలిద్దరూ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వెంకయ్య గురువారం పెద్దశంకరంపేటలో జరిగిన వారాంతపు సంతకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నాగయ్య ఆటో ఎక్కాడు. మార్గమధ్యలో రాంపూర్ శివారులో రాగానే ఆటో బోల్తాపడి ఉంది. ఈ ఘటనలో వెంకయ్య అక్కడికక్కడే మృతి చెందగా, ఆటో డ్రైవరు నాగయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రుడిని జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియరాలేదు. ఘటనాస్థలిలో ట్రాక్టరు వెళ్లిన ఆనవాళ్లు ఉన్నాయని, అది తగిలి ఆటో బోల్తా పడొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పాదచారిని ఢీకొని ద్విచక్ర వాహనదారుడి మృతి



కరుణాకర్

వర్గల్: ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా శునకం అడ్డు రాగా అదుపు తప్పి.. రోడ్డు దాటుతున్న మరొకరిని ఢీకొట్టగా.. ద్విచక్రవాహనదారుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వర్గల్ ఎస్సై కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాములపర్తికి చెందిన నీల కరుణాకర్(29) వంటిమామిడి సమీపంలోని ఓ కంపెనీలో ఉద్యోగి. బుధవారం రాత్రి విధులు ముగించుకొని బైక్‌పై ఇంటికెళ్తున్నాడు. రాజీవ్ హదారిపై అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో రోడ్డు దాటుతున్న ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్‌ను బైక్‌తో ఢీకొట్టాడు. గాయపడిన ఇద్దరినీ 108 వాహనంతో గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కరుణాకర్ పరిస్థితి విషమించడంతో లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కరుణాకర్ సోదరుడు శేఖర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కుమారుడికి అన్నీ తానై తల్లి అంత్యక్రియలు



దుబ్బాక, న్యూస్‌టుడే: చేతికొచ్చిన కొడుకు అండగా ఉంటాడనుకుంది. కానీ అనారోగ్యంతో మృతిచెందడంతో తల్లి అంత్యక్రియలు నిర్వహించిన హృదయ విదారక ఘటన దుబ్బాకలో గురువారం చోటుచేసుకుంది. వివరాలివీ.. 13వ వార్డుకు చెందిన బెల్లె రాజవ్వకు ఇద్దరు కూతుళ్లు(వివాహాలు జరిగాయి), ఒక కుమారుడు. రాజవ్వ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కుమారుడు కనకరాజు(25) కూలీ పని చేస్తూ తల్లిని పోషించేవాడు. మూడు నెలలుగా తీవ్ర అనారోగ్యం బారిన పడి బుధవారం రాత్రి ములుగు ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందగా తల్లి అంత్యక్రియలు నిర్వహించింది. తోడుగా ఉంటాడనుకున్న కుమారుడికి కన్న తల్లి అంత్యక్రియలు చేపట్టడం స్థానికులను కలచివేసింది.

కలగన్నారు.. ఖాకీ ధరించారు!



రికార్డులు తనిఖీ చేస్తున్న శిక్షణ ఎస్సై హారిక

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్

పోలీసు యూనిఫాం ధరించాలనేది వారి కల.. కష్టాలకు ఎదురీది దాన్ని నిజం చేసుకున్నారు. సంకల్పం, పట్టుదల ఉండాలే ఖాకీ దుస్తులు ధరించడం కష్టమేమి కాదని నిరూపించారు ఈ ముగ్గురు యువ మహిళా ఎస్సైలు. పోలీసు నియామక పరీక్షలో ఉద్యోగాలు సాధించి సంగారెడ్డి జిల్లాలో సబ్ ఇన్‌స్పెక్టర్ శిక్షణలో ఉండటం విశేషం.

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్, పటాన్‌చెరు, అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్లలో శిక్షణ ఎస్సైలుగా వికారాబాద్ జిల్లాకు చెందిన ఎ.హారిక, డి.కావేరి, హిమబిందు నెల రోజుల శిక్షణ పొందుతున్నారు. కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ నిర్వహించే విధులు సహా పెట్రోలింగ్, బ్లూకోల్ట్, పగలు, రాత్రి వేళల్లో వాహన తనిఖీలు, కోర్టు విధులు, నేరాలు జరిగినప్పుడు స్పందించాల్సి విధానంపై అవగాహన పెంచుకుంటున్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌లోని ఎస్సైల సహకారంతో విధులు, బాధ్యతలు తెలుసుకుంటున్నారు.

యూనిఫామ్‌పై మక్కువతో..

నా పేరు ఎరువ హారిక. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలం చీమలదరి స్వగ్రామం. అమ్మ బాలమణి టైలర్, నాన్న శేఖర్ ప్రైవేటు పరిశ్రమలో పని చేసున్నారు. వారు కష్టపడి నన్ను పీజీ చదివించారు. తమ్ముడు సూర్యకిరణ్ ఫ్లయింగ్ అధికారిగా పనిచేస్తున్నాడు. పోలీసు యూనిఫామ్ ధరించాలని చిన్నపటి నుంచి కోరిక. టీజీపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవుతుండగా ఎస్సైల భర్తీ ప్రకటన వచ్చింది. ఓ సారి ప్రయత్నిద్దామని దరఖాస్తు చేశా. తొలి ప్రయత్నంలోనే అవకాశం దక్కింది. మా కుటుంబంలో నేనే తొలి ప్రభుత్వ ఉద్యోగిని కావడం ఆనందంగా ఉంది.

ఉపాధ్యాయురాలు కావాలనుకొని..



నా పేరు దూది కావేరి. మాది వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం గాంధీచౌక్ ప్రాంతం. అమ్మ నిర్మల గృహిణి, నాన్న వీరేశం సెక్యూరిటీ సూపర్‌వైజర్, అన్నయ్య భానుప్రసాద్. పాఠశాల విద్యను తాండూరులోని శిశు మందిర్, ఇంటర్ హైదరాబాద్‌లో చదివా. డీఈడీ టీచర్ శిక్షణ పూర్తి చేశా. అనంతరం అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేశా. ఉపాధ్యాయురాలు కావాలని టీటీసీ పూర్తి చేసినా.. ఎస్సై నోటిఫికేషన్ రావడంతో దరఖాస్తు చేశారు. తొలి ప్రయత్నంలోనే ఉద్యోగం వచ్చింది.

గ్రూప్స్‌కి సిద్ధమవుతుండగా..



నా పేరు నాంచెరి హిమబిందు. వికారాబాద్ పట్టణం పులుసు మామిడి స్వగ్రామం. నాన్న రాంరెడ్డి జీహెచ్ఎంసీ ఉద్యోగి, అమ్మ లక్ష్మి గృహిణి. తమ్ముడు హర్షవర్ధన్‌రెడ్డి సివిల్స్ శిక్షణ పొందుతున్నాడు. నర్సాపూర్ బీవీఆర్ఐటీలో ఈఈఈ పూర్తి చేయగా ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగం వచ్చింది. దాన్ని కాదనుకొని గ్రూప్స్ సాధించాలని సిద్ధమయ్యా. ఎస్సై నోటిఫికేషన్ రావడంతో ప్రయత్నించా. తొలి ప్రయత్నంలోనే ఎస్సై ఉద్యోగం సాధించా. లక్ష్యాన్ని నిర్దేశించుకుని శ్రమిస్తే సాధించడం కష్టమేమి కాదు.

ఆత్మరక్షణ విద్యకు వెన్నుదన్ను

రూ.15వేల చొప్పున నిధుల మంజూరు

న్యూస్‌టుడే, సిద్దిపేట, హుస్నాబాద్ గ్రామీణం, చేగుంట, వికారాబాద్ కలెక్టరేట్



కరాటే నేర్చుకుంటున్న బాలికలు

నిత్యం మహిళలు, బాలికలపై ఎక్కడో ఓ చోట దాడులు జరుగుతూనే ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు బాలికలకు ఆత్మవిశ్వాసం పెరిగేలా, స్వీయరక్షణకు ఉపయోగపడేలా ప్రభుత్వం ఆత్మ రక్షణ విద్య కరాటే నేర్పిస్తోంది. ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేసింది. ఈ మేరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు పాఠశాలలను ఎంపిక చేయగా, నిర్దేశించిన కాలంలో శిక్షణ ఇవ్వనున్నారు.

879 పాఠశాలల్లో..

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో రాణి లక్ష్మీబాయి ఆత్మరక్ష ప్రశిక్షణ్ పేరిట కరాటే సాధన చేయించనున్నారు. ఇందుకు ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూర్బా పాఠశాలలను ఎంపిక చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగు జిల్లాల్లోని 699 పాఠశాలల్లో దీన్ని అమలు చేస్తున్నారు. నవంబరు నుంచి మూడు నెలల పాటు దీన్ని కొనసాగిస్తారు. ఆయా ప్రాంతాలకు చెందిన శిక్షకులను నియమించారు.

కరాటే శిక్షణకు ఎంపిక ఇలా..

జిల్లా	పాఠశాలలు	నిధులు(రూ.లక్షల్లో..)
మెదక్	191	28.65
సంగారెడ్డి	250	37.50
సిద్దిపేట	258	38.71
వికారాబాద్	180	27.00

వారానికి రెండు తరగతులు

శిక్షకులకు సొంత మండలంలోని పాఠశాలల బాధ్యత అప్పగించారు. వీరు వారానికి రెండు తరగతుల చొప్పున ఆత్మరక్షణ విద్య నేర్పిస్తారు. నెలకు రూ.5 వేల చొప్పున వేతనం చెల్లిస్తారు ఒక్కో పాఠశాలకు రూ.15 వేల చొప్పున మంజూరయ్యాయి.

నైపుణ్యాలు నేర్పిస్తాం:



పాఠశాలల్లో బాలికలకు కొన్నేళ్లుగా కరాటే నేర్పిస్తున్నా. ఎవరైనా దాడి చేస్తే ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పిస్తూ సొంతంగా రక్షించుకునేలా విద్య నేర్పిస్తున్నాం. దీని ద్వారా బాలికల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ధైర్యంగా వెళ్లగలుగుతారు.

భూక్యా రమేశ్, కరాటే శిక్షకుడు

వచ్చే నెల 1 నుంచి..:



కరాటే శిక్షణకు నిధులు మంజూరయ్యాయి. ఇన్‌స్ట్రక్టర్ల నియామకం కూడా పూర్తయింది. ప్రస్తుతం పరీక్షలు కొనసాగుతున్నాయి. నవంబరు 1 నుంచి నిధులు మంజూరైన అన్ని పాఠశాలల్లో శిక్షణ ప్రారంభిస్తాం. బాలికలకు ఆత్మరక్షణ విద్య చాలా అవసరం. వారిలో ఆత్మవిశ్వాసాన్ని, మనోధైర్యాన్ని నింపుతుంది.

శ్రీనివాసరెడ్డి, సిద్దిపేట డీఈవో

(c) eenadu

జహీరాబాద్‌-తిరుపతి బస్సు వేళల్లో మార్పు

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తిరుమల భక్తుల సౌకర్యార్థం జహీరాబాద్ నుంచి తిరుపతికి నడుపుతున్న బస్సు సర్వీసు వేళల్లో మార్పులు చేసినట్లు డీఎం జాకీర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి జహీరాబాద్ నుంచి తిరుపతికి మధ్యాహ్నం 1:15 నిమిషాలకు బయలుదేరి తిరుపతికి తెల్లవారుజామున 3:30 గంటకు చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణంలో తిరుపతిలో ఉదయం 9 గంటలకు బయలుదేరి రాత్రి 10:45 నిమిషాలకు జహీరాబాద్ చేరుకుంటుందన్నారు.

ఇర్ఫాని దర్గా ఉర్సు



సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణ శివారులోని ఇర్ఫాని దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. గంధారాం, కవి సమ్మేళనం నిర్వహించారు. దర్గా పీఠాధిపతి అహ్మద్ బీవీ ఆధ్వర్యంలో ఉత్సవాలు గత రెండు రోజుల నుంచి కనుల పండువగా సాగాయి. జిల్లా వాసులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పలువురు పాల్గొన్నారు.


క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రత్నప్రసాద్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో క్యాన్సర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్యాన్సర్ నిర్మూలనే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ముందుకు సాగడం అభినందనీయమన్నారు. క్లబ్ జిల్లా అధ్యక్షుడు రాములు గౌడ్ పాల్గొన్నారు.

గనుల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు

జహీరాబాద్ అర్బన్: జహీరాబాద్ డివిజన్‌లోని ఎర్ర రాయి గనుల్లో మైనింగ్ టాస్క్‌ఫోర్స్ బృందం దాడులు ముమ్మరం చేసింది. న్యాల్‌కల్ మండలం గణేష్‌పూర్‌లోని గనుల్లో మైనింగ్ శాఖ ఏడీ రమేష్‌బాబు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సాయిరాం, ఆర్ఐ శ్యామ్‌రావు బృందం తనిఖీలు చేపట్టి రెండు రాయి కోత యంత్రాలను జప్తు చేశారు. అక్రమ తవ్వకాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆలయంలో నాగు పాము



సదాశివపేట: పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయంలోకి బుధవారం రాత్రి నాగుపాము ప్రవేశించింది. అక్కడే నిద్రిస్తున్న దీక్షధారులు పక్కన ఉండగా.. మరొకరు గమనించి అతడిని మేల్కొలిపి పక్కకు జరిపారు. తరువాత పాములు పట్టే వ్యక్తికి సమాచారం ఇవ్వగా పాము గ్రిల్స్ పైకి ఎక్కింది. పాములు పట్టేవారు తీసుకెళ్లి పొలాల్లో వదిలేశారు.

టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

సదాశివపేట: సదాశివపేట మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి.శంకర్(వెంకటాపూర్), ఉపాధ్యక్షులుగా బాలరాజు, సుప్రియ ప్రధాన కార్యదర్శిగా సురేష్(మద్దికుంట), కార్యదర్శులుగా ఎఫ్సిబా, భూమయ్య, రాజకరణ్‌రెడ్డి, సందీప్, జగన్ మోహన్, కోశాధికారిగా ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు.

తాగునీటి సరఫరాపై నేటి నుంచి శిక్షణ

వట్‌పల్లి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరా చేసే సహాయకులకు శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీవో ఖాజానసీరుద్దీన్ గురువారం తెలిపారు. సహాయకులు శిక్షణకు తప్పని సరిగా హాజరుకావాలని కోరారు.

ప్రాధాన్య క్రమంలో సమస్యల పరిష్కారం

ఐడీఏ బొల్లారం, (జిన్నారం): ప్రాధాన్యతా క్రమంలో సమస్యలు పరిష్కరిస్తున్నామని ఐడీఏ బొల్లారం పురపాలిక అధ్యక్షురాలు కె.రోజారాణి చెప్పారు. గురువారం 9, 11 వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఇప్పటికే అన్ని వార్డుల్లో మురుగు కాలువల నిర్మాణం, సీసీ రోడ్డు పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్పయాదవ్, ఏఈ కిష్టయ్య ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు

జిన్నారం: ఖాజీపల్లి 181 జీఎంఆర్ కాలనీ సమస్యల పరిష్కారానికి అధికారులు శ్రీకారం చుట్టారు. 'ఈనాడు'లో వరుస కథనాల నేపథ్యంలో గురువారం జిల్లా శిశు సంరక్షణ అధికారిణి లలితకుమారి, సహాయ కార్మికశాఖ అధికారిణి నీరజ, సీడీపీవో జయరామ్, స్త్రీ శిశు సంక్షేమశాఖ పర్యవేక్షకురాలు మీరా బాయి, జెండర్ స్పెషలిస్ట్ యాదగిరి, విశాల కాలనీని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని, లేబర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా కేంద్రాన్ని ప్రారంభిస్తామని చెప్పారు.

అధ్వాన దారులు.. అడుగడుగునా అవస్థలు

• పస్తాపూర్ కూడలి, పరిసర కాలనీలను వెంటాడుతున్న సమస్యలు

న్యూస్‌టుడే-జహీరాబాద్: జహీరాబాద్ పట్టణ శివారులో వేగంగా అభివృద్ధి చెందుతున్న పస్తాపూర్ కూడలి, దాని పరిసర కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ పరిధిలో ఉన్న ఈ ప్రాంతాన్ని ఐదేళ్ల క్రితం పురపాలక సంఘంలో విలీనం చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కావడం లేదని స్థానికులు వాపోతున్నారు. అంతర్గత రహదారులు, మురుగునీటి కాల్వలు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయని స్థానికులు తెలిపారు.



ఆనంద్‌నగర్ కాలనీలో రహదారి దుస్థితి

వేగంగా విస్తరిస్తున్న కాలనీలు

జహీరాబాద్, హైదరాబాద్ జాతీయ రహదారిపై పట్టణ శివారులో వెలసిన పస్తాపూర్ చౌరస్తా(కూడలి)కు ఆనుకొని చుట్టూ ఆనంద్‌నగర్, మహీంద్రకాలనీ, డబుల్ బెడ్‌రూం కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఉత్తమ్‌నగర్ కాలనీ, మంగపురం కాలనీ అయ్యప్పకాలనీలు ఉన్నాయి. వీటికి తోడు ఇక్కడికి సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా, ఝరాసంగం రహదారికి ఇరువైపుల అనేక కొత్త కాలనీలు వెలుస్తుండటంతో ఈ కూడలి వేగంగా అభివృద్ధి చెందుతోంది. కానీ కనీస సౌకర్యాలు లేక ఈ కూడలి ప్రాంతం, సమీపంలోని కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

దోమలతో ఇబ్బందులు

ఆనందర్‌నగర్, మహీంద్రా కాలనీలో ప్రధాన రహదారితో పాటు ఇతర అంతర్గత రహదారులు గుంతలమయంగా మారాయి. అందులో మురుగు, వర్షపు నీరు చేరగా, చుట్టూ పిచ్చిమొక్కలు నిండిపోయాయి. కొన్ని వీధుల్లో వాహనాలే కాదు.. కనీసం కాలినడకన వెళ్లాలన్నా అవస్థలు తప్పటం లేదు. ఆర్టీసీ, ఉత్తమ్‌నగర్ కాలనీల్లో మురుగు కాల్వల నిర్మాణం చేపట్టకపోవడంతో ఇళ్ల మధ్యన, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, మురుగు నీటి గుంతలు మడుగులను తలపిస్తున్నాయి. దీంతో పరిసర ఇళ్లల్లోని ప్రజలు ఈగలు, దోమలు, దుర్వాసనతో సతమతమవుతున్నారు.

తాగునీటికీ ఇక్కట్లు: కొన్ని ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైపులైను వేయకపోగా, వేసిన ప్రాంతాల్లో సైతం నీటి సరఫరా సక్రమంగా జరగక ఇబ్బందులు పడుతున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రిల్లో అంధకారం నెలకొనగా, పిచ్చిమొక్కలు పేరుకుపోయి పాములు, క్రిమికీటకాలు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడదతో పిల్లలు, వృద్ధులు బయట తిరగలేని పరిస్థితి నెలకొంది.



ఉత్తమ్‌నగర్ కాలనీలో ఇళ్ల మధ్య మురుగు

ఒక్కొక్కటిగా చేపడతాం: జి.శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్, పురపాలక సంఘం, జహీరాబాద్.

పస్తాపూర్ కూడలి, సమీపంలోని కాలనీల్లో ఇటీవల పర్యటించి సమస్యలు తెలుసుకున్నా. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో మురుగు కాల్వలు, సిమెంటు దారులు వేయగా, మిగతా ప్రాంతాల కోసం ప్రతిపాదనలు పంపించాం. మిషన్ భగీరథ నీటిసరఫరా కోసం పైపులైను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఫోన్ చేయాల్సిన నంబర్లు (10AM TO 1 PM)
సంగారెడ్డి 8008573233, జహీరాబాద్ 9441648363
నారాయణఖేడ్ 8008573248, నారాయణఖేడ్ టౌన్ 8008573250
అందోలు 8008573241, జిన్నారం 8008573231

న్యూస్‌టుడే, జోగిపేట, సంగారెడ్డి మున్సిపాలిటీ, జోగిపేట

? అందోలుగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన మినీ నీటి ట్యాంకు నిరుపయోగంగా ఉంది. కుళాయిలు విరిగిపోయాయి. –మాణయ్య, అందోలు.

✓ నీటి ట్యాంకును పరిశీలించి దానికి కొత్త కుళాయిలు వేయిస్తాం. నీటి ఇబ్బందులు తీరుస్తాం. –తిరుపతి, పుర కమిషనర్ అందోలు– జోగిపేట.

? జోగిపేటలో క్లాక్‌టవర్ సమీపంలోని బద్రప్ప ఆసుపత్రి వద్ద ఉన్న విద్యుత్తు స్తంభం మధ్యలో వంకరగా మారి ప్రమాదకరంగా ఉంది. ప్రధాన రహదారికి పక్కనే ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. –పవన్, జోగిపేట.

✓ స్తంభం తొలగించి కొత్తది ఏర్పాటు చేస్తాం. –శ్రీనివాస్, ఏఈ విద్యుతు శాఖ అందోలు

? సంగారెడ్డిలోని శుక్రవారం మార్కెట్‌లో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి ఇబ్బందిగా మారింది. – శ్రీనివాస్, సంగారెడ్డి

✓ వెంటనే సిబ్బందిని పంపి వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తాం. – ఇంతియజ్ అహ్మద్, పురపాలక డీఈఈ.

? సంగారెడ్డిలోని నాల్‌సాబ్‌గడ్డలో మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వస్తోంది. – అహ్మద్, సంగారెడ్డి

✓ సిబ్బందిని పంపి మురుగు కాల్వ శుభ్రం చేయిస్తాం. – సైదులు, పారిశుద్ధ్య పర్యవేక్షకులు.

? అందోలుగూడెం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఉన్న మినీ నీటి ట్యాంకులో నీరు నింపక నిరుపయోగంగా ఉంది. కుళాయిలు విరిగిపోయాయి. – మాణయ్య, అందోలు.

✓ నీటి ట్యాంకును పరిశీలించి కొత్త కుళాయిలు వేయిస్తాం. – తిరుపతి, పుర కమీషనర్ అందోలు– జోగిపేట.

? జోగిపేటలో క్లాక్‌టవర్ సమీపంలోని విద్యుత్తు స్తంభం వంకరగా మారి ప్రమాదకరంగా ఉంది. – పవన్, జోగిపేట.

✓ దాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేస్తాం. – శ్రీనివాస్, ఏఈ విద్యుతు శాఖ అందోలు.

ప్రతి పంటకు గిట్టుబాటు ధర: ఎమ్మెల్యే



క్రిష్ణాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి

కల్హేర్, నారాయణఖేడ్: రైతులు పండించిన ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా.సంజీవరెడ్డి అన్నారు. గురువారం ఆయన కల్హేర్ మండలంలోని రాపర్తి, క్రిష్ణాపూర్, నాగధర్, నిజాంపేట్ మండలంలోని బాచేపల్లి, నిజాంపేట్, నారాయణఖేడ్ మండలంలోని తుర్కపల్లి, హన్మంతరావుపేట, నిజాంపేట, బాచేపల్లి, రాపర్తి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. రైతులు అధైర్యపడవద్దని.. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. ఖేడ్ క్యాంపు కార్యాలయంలో 123 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్లు భాస్కర్, శివశ్రీనివాస్, ఐపీఎం వంశీకృష్ణ, పీఏసీఎస్ ఛైర్మన్ శోభాఅశోక్‌రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తాహెర్‌అలీ, శంకర్‌ముదిరాజ్, దత్తు తదితరులు పాల్గొన్నారు. ● రంగంపేట ఆశ్రమపీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామికి ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి స్వగృహంలో ఆయనతోపాటు సోదరులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాతృమూర్తి కమలమ్మ పాదపూజ నిర్వహించి ఆశీస్సులు పొందారు.

మేడాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే వివేకానంద

గుమ్మడిదల: మేడాలమ్మ తల్లిని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద దర్శించుకున్నారు. గురువారం ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ వ్యవస్థాపకులు సంజీవరెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న పోలీస్ పికెటింగ్

పుల్కల్: మండల పరిధిలోని మిన్పూర్ గ్రామంలో పోలీసుల పికెటింగ్ కొనసాగుతోంది. ఈనెల 20, 21 తేదీల్లో గ్రామంలో రెండు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణలు జరిగాయి. ప్రస్తుతం గ్రామంలో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయి. తహసీల్దారు కృష్ణ, సీఐ అనిల్‌కుమార్, ఎస్ఐ క్రాంతి కుమార్ పర్యవేక్షిస్తున్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

న్యూస్‌టుడే-జహీరాబాద్: జహీరాబాద్ పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన 9 మంది లబ్ధిదారులకు రూ.2,74,000ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అందజేశారు. భారాస నేతలు యాకూబ్, పద్మజ, సత్య పాల్గొన్నారు.

బోరు ఇలా.. నీరు పట్టుకునేదెలా?



నాగల్‌గిద్ద మండలం కూభనాయక్ తండా పంచాయతీ పరిధిలోని వాలునాయక్ తండాలో చేతిపంపు వద్ద పొదలు పెరిగాయి. దీంతో నీరు పట్టుకోవడానికి రాకుండా మారింది. భగీరథ నీరు రాని రోజు నీరు పట్టుకుందామంటే పొదల్లో వెళ్లడానికి స్థానికులు జంకుతున్నారు. విష కీటకాలతో ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. అంతేకాదు దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చేతిపంపు చుట్టూ పొదలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని తండా వాసులు కోరుతున్నారు. –న్యూస్‌టుడే, మనూరు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి: హరీశ్‌రావు



ప్రభాకర్‌రెడ్డిని అభినందిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పార్టీని రెట్టింపు ఉత్సాహంతో బలోపేతం చేయడానికి సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. గురువారం గుమ్మడిదల మండలం పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన కొత్తపల్లి ప్రభాకర్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నరహరిలను సీనియర్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి హరీశ్‌రావుకు పరిచయం చేశారు. నాయకులు వెంకటేశంగౌడ్, ఆదర్శరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిన్నారం: అవకాశవాదులు మాత్రమే పార్టీ మారారని, కార్యకర్తలు భారాసలోనే ఉంటారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ భారాస ముఖ్య నాయకులు మెట్టుకుమార్ యాదవ్, ఆదర్శరెడ్డి, కె.బాల్‌రెడ్డి, వెంకటేశంగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు మాజీ మంత్రిని ఘనంగా సత్కరించారు.

అంబేడ్కర్ విగ్రహం వద్ద గోడ కట్టొద్దు

సంగారెడ్డి అర్బన్: హైదరాబాద్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి గోడ నిర్మించడాన్ని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పంబాల దుర్గా ప్రసాద్ ఖండించారు. గురువారం సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ.. విగ్రహానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల విజయరావు, మోహన్‌రాజు పాల్గొన్నారు.

వసతిగృహంలో నాణ్యమైన భోజనం



మాట్లాడుతున్న వసతిగృహ సంక్షేమ అధికారి రవీందర్

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని సమీకృత బాలుర వసతిగృహంలో గురువారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. వసతి గృహసంక్షేమ అధికారులు రవీందర్, పండరి మాట్లాడుతూ.. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంతో పాటు వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



మాధవానందస్వామి సరస్వతి స్వామితో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు

నారాయణఖేడ్: ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం ఖేడ్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు విఠల్‌రావు పాటిల్, మాజీ జడ్పీటీసీ లక్ష్మిబాయి రవీందర్‌నాయక్, మాజీ సర్పంచి సంగప్ప, కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్‌గొండ, పురపాలిక కౌన్సిలర్ అభిషేక్ షెట్కార్ తదితరులు పాల్గొన్నారు. ● రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ఖేడ్‌లోని శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయానికి రాగా భూపాల్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు.

ఎస్‌జీటీయూ కార్యవర్గం ఎన్నిక

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: సెకండరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్(ఎస్‌జీటీయూ) జహీరాబాద్ పట్టణ, మండల కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య తెలిపారు. జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడిగా మహ్మద్ షకీల్, ప్రధాన కార్యదర్శిగా సుకుమార్, కోశాధికారిగా యాదుల్లా, మండల కార్యవర్గం అధ్యక్షుడిగా విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా దయాకర్, కోశాధికారి రాజేందర్‌లను నియమించి నియామక పత్రాలను అందజేశారు.

సంస్థపై తప్పుడు ప్రచారం సరికాదు: డీడీఎస్

జహీరాబాద్, న్యూస్‌టుడే: జహీరాబాద్ ప్రాంతంలో మహిళా సాధికారత కోసం పనిచేసిన దక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ(డీడీఎస్) సంస్థలో గతంలో పనిచేసిన వారే సంస్థపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆ సంస్థ అధ్యక్షుడు సంజయ్ పేర్కొన్నారు. గురువారం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ జాయింట్ డైరెక్టర్ గిరిధర్, మహిళా సభ్యులు అనుసూయ, నాగమ్మ, లక్ష్మమ్మ, తదితరులు పలు అంశాలను తెలియజేశారు.

నూనె గింజల సాగుకు ప్రోత్సాహం

మొగుడంపల్లి (జహీరాబాద్ అర్బన్): నూనె గింజల పంటల సాగు చేసే రైతులకు జాతీయ ఆహార భద్రత పథకంతో ప్రోత్సహిస్తున్నట్లు జహీరాబాద్ డీడీఎస్-కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.వరప్రసాద్ పేర్కొన్నారు. మొగుడంపల్లి మండలం గొడిగార్‌పల్లిలో గురువారం రైతులకు ఐఎస్ఎఫ్-764 రకం తెల్ల కుసుమలను పంపిణీ చేశారు. కేవీకే ఆధ్వర్యంలో కంది సాగు చేస్తున్న రైతులకు లింగాకర్షక బుట్టలు, వేపనూనె అందజేశారు.

రూ.16 లక్షల పరిహారం అందజేత

జిన్నారం: జిన్నారం మండలం కిష్టయ్యపల్లిలో కాలుష్య జలాలు తాగి 20 గేదెలు మృతి చెందిన నేపథ్యంలో మోడల్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ రూ.16లక్షల పరిహారం గురువారం అందించింది. అసోసియేషన్ అధ్యక్షుడు మూర్తి బాధిత రైతు సాయికిరణ్‌కు చెక్కును అందించారు.

EENADU Classifieds

EDUCATION

ACCOUNTS

Learn GST, TDS, TCS, ESI, EPF Online returns in 8 Sundays from OCT 27th in online classes. Ph: 9292959527

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

CHANGE OF NAME
I, SHAKE SOHEL AHMED (Old Name) S/o Mohammed Abdul Saleem R/o H.No: 10-1-180, Mangammathota, Beside SBI Bank, Siddipet (Town & District) declare that I Changed my Name from SHAKE SOHEL AHMED to MOHAMMED ABDUL SOHAIL SALEEM.

CHANGE OF NAME
I, V S SRIDEVI KODAVANTI (Old Name) W/o VADALI SRIDHAR Residence of Plot No 300 Adarsh Nagar Colony, Ward No 4, Zaheerabad, Sangareddy District TS,. Have Change my name as VADALI SRIDEVI (New Name)

JOBS

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్+ భో॥ Hyd. Ph: 9182260297.

Dr. Reddy's ఫౌండేషన్ వారు: దివ్యాంగులకు జాబ్స్ స్కిల్స్‌లో శిక్షణ ఇచ్చి MNC's జాబ్ కల్పించబడును. Q: ఇంటర్ & ఆపైన @ చందానగర్. Ph: 7569719337

TOURS AND TRAVELS

రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, కంచి 10,500/- 8 రో॥ 25-11 * కాశి, ప్రయాగ, అయోధ్య, నైమిషారణ్యం 12,500/- 9 రో॥ 1-12 అన్ని టూర్స్ మా స్వంత భోజనం & రూమ్స్ సత్యసాయి. 9618933189.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఎటువంటి సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

'కార్మికుల శ్రమ దోపిడీ సరికాదు'

పుల్కల్, న్యూస్‌టుడే: కార్మికుల శ్రమదోపిడీ చేయడం సరికాదని హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వర్ ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎస్.ఇటిక్యాల ఎంఎస్ ఇండస్ట్రీస్ ఎదుట బోనస్ కొరకు కార్మికులు చేపట్టిన నిరసనకు వారు మద్దతు తెలిపారు. నష్టాలను సాకుగా చూపుతూ బోనస్ ఎగవేసేందుకు కంపెనీ ప్రయత్నిస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్, భారీగా కార్మికులు పాల్గొన్నారు.



కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఉపకార వేతనాలు విద్యార్థుల హక్కు: ఏబీవీపీ



జహీరాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నాయకులు

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: బోధనా రుసుములు, ఉపకార వేతనాలు ప్రభుత్వం అందించే భిక్ష కాదని విద్యార్థులకు దక్కాల్సిన హక్కు అని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రవీణ్, రాజు అన్నారు. జహీరాబాద్‌లో గురువారం సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై భారీ ర్యాలీ చేపట్టారు. బస్టాండు చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వాహన రాకపోకలు భారీగా స్తంభించడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.

రైల్వే కార్మికుల పక్షాన రాజీలేని పోరాటం



జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో నాయకుల ప్రచారం

న్యూస్‌టుడే, జహీరాబాద్ అర్బన్: రైల్వే ఉద్యోగులు, కార్మికుల హక్కుల సాధన కోసం మజ్దూర్ యూనియన్ రాజీలేని పోరాటాలు చేస్తుందని సంఘం సికింద్రాబాద్ డివిజనల్ కార్యదర్శి రవీందర్ అన్నారు. కార్మిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జహీరాబాద్ రైల్వేస్టేషన్ సహా గేట్‌ల వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. అదనపు కార్యదర్శి రమేష్, కోశాధికారి నర్సింహారెడ్డి, వికారాబాద్ బ్రాంచ్ ఛైర్మన్ మాధవకృష్ణ, నాయకులు బహద్దూర్, శ్యామ్ చౌహాన్ తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయదారుడి అరెస్టు

ఝరాసంగం: ఎండు గంజాయి తరలిస్తున్న నిందితుడిని పట్టుకుని గురువారం రిమాండ్‌కు పంపించినట్లు జహీరాబాద్ రూరల్ సీఐ హన్మంతు తెలిపారు. గురువారం ఝరాసంగం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై నరేశ్‌తో కలిపి వివరాలు వెల్లడించారు. బర్దీపూర్ శివారులో కర్ణాటకలోని బీదర్ నుంచి ద్విచక్రవాహనంపై బోపన్‌పల్లి గ్రామానికి చెందిన మ్యాతరి అనిల్ బుధవారం రాత్రి వస్తుండగా అనుమానం వచ్చి పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. ఆయన వద్ద 1295 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బీదర్‌కు చెందిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని సీఐ తెలిపారు.

దిగుబడి లేక.. ధర రాక..

ఇబ్బందుల్లో చెరకు రైతులు



చెరకు పంటను కోస్తున్న కూలీలు

నారాయణఖేడ్ టౌన్, న్యూస్‌టుడే: పెరిగిన పెట్టుబడికి అనుగుణంగా చెరకు ప్రోత్సాహక ధర లేకపోవడం రైతులను కన్నీళ్లు పెట్టిస్తోంది. ఈ ఏడాది జోరుగా కురిసిన వర్షాలకు దిగుబడి అమాంతం తగ్గింది. ఏటా ప్రోత్సాహక ధరను ప్రకటించే కేంద్రం కొసిరి కొసిరి పెంచి మిన్నకుంటోంది. దిగుబడులు, ధరకు పొంతన కుదరకపోవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో చెరకు తోటలు కనుమరుగయ్యే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు వ్యయం: సాగుకు పెట్టే పెట్టుబడి కంటే చెరకు తోటలు కత్తిరించేందుకు అయ్యే వ్యయం భారీగా పెరుగుతోంది. కర్మాగారాల నిర్వాహకుల పర్యవేక్షణ కొరవడటం వల్ల చెరకు కొట్టే కూలీలు కట్నం(అదనంగా చేసే వసూలు) పేరుతో ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు డిమాండు చేస్తున్నారు. చక్కెర శాతం అధికంగా రావాలనే ఉద్దేశంతో కంపెనీలు తమకు నచ్చిన వంగడాలనే విత్తనంగా ఇచ్చారు. వీటితో దిగుబడులు గణనీయంగా తగ్గనున్నాయి. ఈసారి ధర పెంచకుంటే అప్పులే మిగులుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు రవాణా వ్యయంతో పాటు కూలీ ఖర్చులు భారీగా పెంచారు. టన్నుకు రూ.900 ఖర్చులే పోతున్నాయి. పంట కర్మాగారానికి వెళ్లిన మూడు నెలలకు నగదు చెల్లింపులు చేస్తున్నారు.

20 వేల ఎకరాల్లో సాగు

సంగారెడ్డి జిల్లాలో ఈసారి సుమారు 20వేల ఎకరాల్లో చెరకును సాగు చేశారు. టన్ను చెరకుకు గతేడాది రూ.3,464 చెల్లించారు. రూ.218 పెంచుతూ ఈ ఏడాది రూ.3,682గా నిర్ణయించారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితుల ప్రభావంతో ఎకరాకు 25 టన్నుల దిగుబడి వచ్చేటట్లు కనబడటంలేదు. సాగు వ్యయం ఎకరాకు రూ.70 వేలు దాటుతుంది. టన్నుకు రూ.4,500 ఇస్తేనే గిట్టుబాటు అవుతుందని ఇటీవల సంగారెడ్డిలో కలెక్టర్ నిర్వహించిన సమావేశంలో రైతు సంఘాలు డిమాండ్ చేశారు.

బంద్ విజయవంతం



రోడ్డుపై బైఠాయించిన సభ్యులు

కల్హేర్: హిందూ దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం సంఘటనలను నిరసిస్తూ కల్హేర్, నిజాంపేట్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో గురువారం బంద్ నిర్వహించారు. వాణిజ్య, వ్యాపార సంస్థలు పూర్తిగా మూతపడ్డాయి. కల్హేర్ గ్రామంలో హిందూ సంఘాల సభ్యులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నిజాంపేట్‌లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ నాగజ్యోతికి వినతి పత్రాన్ని అందజేశారు.

బకాయిలు విడుదల చేయండి

నారాయణఖేడ్: పెండింగులో ఉన్న బోధనా రుసుములు, ఉపకార వేతనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఖేడ్ రాజీవ్‌కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. తహసీల్ మైదానం నుంచి రాజీవ్‌కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి కూడలిలో ధర్నా చేశారు. ఖేడ్ సంయుక్తకార్యదర్శి శంకర్, నాయకులు విజయ్, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.